క్లుప్తంగా

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



తునిలో సీఐటీయూ జెండాకు సెల్యూట్ చేస్తున్న మహిళలు

తుని: కార్మికుల హక్కుల రక్షణ కోసం సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ సంఘ తుని మండలశాఖ అధ్యక్షురాలు వై.ధనలక్ష్మి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.లలితకుమారి, బి.శ్రీదివ్య, శ్రీదేవి, అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



తునిలో వరమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న విజయ్‌ప్రకాష్ దంపతులు

తుని: స్థానిక చిట్టూరి మెట్రో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పండితులు ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం, నిత్యోపాసన, వరమహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ అందించిన స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్‌లో విద్యార్థులు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు టి.వెంకటాపురంలో విద్యార్థులకు బుధవారం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ప్రతినిధులు స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ విద్యార్థులకు బ్యాగ్‌లు, బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ప్రతినిధులు ద్వారా గ్రామాల్లో పేద ప్రజల ఇబ్బందులను గుర్తించి, అవసరాలకు అనుగుణంగా ప్రతినెలా సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. డైరెక్టర్లు పప్పు విజయకుమార్, విజయబాబు, బాబీ, అర్జునరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



ఏలేశ్వరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ సత్యనారాయణ

ఏలేశ్వరం: గణితంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గణిత ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత ఫార్ములాపై పరీక్ష నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలంటే ఫార్ములాపై అవగాహన ఉండాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి, గౌరంపేట, మండపం, కత్తిపూడి గ్రామాల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తేజ పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేయడంతో పాటు, పోషక విలువలు గల సమతుల్య ఆహారం తీసుకుంటే మెడ, వెన్నుపూస సమస్యలు రావన్నారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రెడీ



ఎ.అగ్రహారంలో వేసవి దుక్కులు చేసిన పొలం

- వేసవి దుక్కులు చేస్తున్న రైతులు
- 79,550 ఎకరాల్లో వరి సాగుకు సన్నాహాలు
- 3750 క్వింటాళ్ల విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు



గవరపేటలో దుమ్ములో కలియదున్నేందుకు మళ్లలో వేసిన గెత్తం

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. మెట్టలో నీటి వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తుంటారు. ప్రస్తుతం రైతులు వేసవి దుక్కులు చేసే పనిలో బిజీగా ఉన్నారు. తొలకరి వర్షాలు కురిస్తే సకాలంలో సాగు చేసేందుకు రైతులు, విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోపక్క జూన్ ఒకటి తేదీన మొదట విడత పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మెట్టలో ఇలా...

మెట్ట ప్రాంతంలోని తొమ్మిది మండలాల్లో సాధారణ వరిసాగు విస్తీర్ణం 79,550 ఎకరాలుగా ఉంది.

మండలం	విత్తనాలు (క్వింటాళ్లలో)	సాధారణ సాగు (ఎకరాల్లో)
తుని	630	9224
తొండంగి	365	14500
కోటనందూరు	1444	6728
రౌతులపూడి	456	7504
శంఖవరం	155	5882
ప్రతిపాడు	256	10235
గండేపల్లి	60	10926
జగ్గంపేట	200	9061
ఏలేశ్వరం	184	5500
మొత్తం	3750	79550

> **మెట్టలో ఆలస్యంగా నాట్లు**
>
> ఉన్న సాగునీటి వనరులతో పాటు మెట్టలో రైతులు ఎక్కువ వర్షాధారంపై ఖరీఫ్ సాగు చేస్తుంటారు. దాంతో మెట్ట ప్రాంతంలో ఆలస్యంగా ఆగస్టులో వరినాట్లు వేస్తారు. రైతుల అవసరాలు మేరకు సబ్‌డివిజన్‌లో పది వేల క్వింటాళ్ల ఎంటీయూ-1061, 64, ఆర్‌జీఎల్-2537, బీపీటీ-5204 రకాల వరి విత్తనాలను రప్పించి, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. ఎరువులు ఇప్పటికే కొంతమేరకు అందుబాటులో ఉంచాం. చిరుధాన్యాల సాగు చేసే రైతుల అవసరాలకు అనుగుణంగా కొర్రలు, రాగులు, జొన్న విత్తనాలను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పత్తి సాగుకు అవసరమైన విత్తనాలు ప్రైవేట్ డీలర్ల వద్ద రైతులు కొనుగోలు చేసుకోవలసి ఉంది. సరైన విత్తనాలను కొనుగోలు చేసి రసీదు పొందాలి. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం తగదు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందే మార్గాలను, సేంద్రియ సాగు పద్ధతులను రైతులు పాటించాలి.
>
> – సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

రైతులు డిమాండ్ మేరకు 3750 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి, ఉన్నత అధికారులకు నివేదికలు పంపారు. మరోపక్క చిరుధాన్యాల సంవత్సరంగా ప్రపంచ ఆహార సంస్థ ప్రకటించడంతో మెట్ట భూముల్లో ఆరుతడిగా సాగయ్యే రాగులు (చోళ్లు), జొన్నలు, కొర్రలు పంటలను అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్య అప్పారావు

జగ్గంపేట: ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ప్రజలు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు సూచించారు. స్థానిక సంత మార్కెట్ సచివాలయం వద్ద బుధవారం ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారధి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారధి కార్యక్రమం ద్వారా ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారని తెలిపారు. దీంతో పాటు గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు వారి ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ పాల్గొన్నారు.

కొండపోడు భూమికి పట్టాలు



గజ్జనపూడిలో కొండపోడు భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామరాజు, మైన్స్ డీడీ నరసింహారెడ్డి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి రెవెన్యూ పరిధిలోని 262 సర్వే నంబర్‌లోని కొండపోడు భూమికి సంబంధించి 90 మందికి పట్టాలు మంజూరు చేసేందుకు జిల్లా ఎస్సైన్డ్ కమిటీ అమోదం తెలిపినట్టు పెద్దాపురం ఆర్డీఓ సీతారామరావు తెలిపారు. ఈ ప్రాంతాన్ని బుధవారం ఆయన మైన్స్ డీడీ నరసింహారెడ్డి, స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణలతో కలిసి పరిశీలించారు. గిరిజనులకు పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించిన కొండపోడు భూమిలో ఖనిజ సంపద ఉన్నదీ, లేనిది నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆర్డీఓ తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బషీర్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నూతన పాలకవర్గం సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నూతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పర్వత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక వర్గ సభ్యులు పారదర్శకంగా రైతులకు సేవలు అందించాలని సూచించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందించాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగిరెడ్డి రమణమ్మ, వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్లు గోళ్ల జయశేఖర్, సూరంపూడి సూకరాజు, లంపకలోవ సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తులకు మెరుగైన సేవలు

- పశ్చిమ రాజగోపురం వద్ద గైడ్లు భక్తులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు
- ఇక పీఆర్వో ఆఫీసులోనే అన్ని పథకాలకు విరాళాల స్వీకరణ
- ఈఓ చంద్రశేఖర్ అజాద్



వ్రతమండపంలో ఏసీ పని తీరును పరిశీలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులను గైడ్లు మభ్యపెట్టి సులభంగా వ్రతాలు, దర్శనం చేయిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీనిని నివారించేందుకు గాను ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నలుగురు హోమ్ గార్డులు అక్కడ నియమిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ హోంగార్డులు కూడా గైడ్స్‌తో కుమ్మక్కు అయితే వారిపై చర్యలు తీసుకుంటామని ఈఓ హెచ్చరించారు.

సింగిల్ విండో ద్వారా అన్ని రకాల విరాళాలు స్వీకరణ

పీఆర్వో కార్యాలయంలో ప్రస్తుతం అన్నదానం విరాళాలు మాత్రమే స్వీకరిస్తున్నారు. గోసంరక్షణ, సత్రం రూమ్ డోనార్ స్కీం, శాశ్వత వ్రతాలు, కల్యాణం తదితర విరాళాలు ఆయా కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని స్వయంగా గమనించిన ఈఓ గురువారం నుంచి అన్నిరకాల విరాళాలు సింగిల్ విండో ద్వారా పీఆర్వో కార్యాలయంలోనే స్వీకరించాలని ఆదేశించారు.

దేవస్థానం దత్తత ఆలయాల వివరాలతో బోర్డులు ప్రదర్శన

అన్నవరం దేవస్థానం కోరుకొండ నరసన్న ఆలయంతో సహా మొత్తం 20 ఆలయాలను దత్తత తీసుకుని నిర్వహిస్తోంది. ఆ ఆలయాల వివరాలు, వాటి నిర్వహణకు అవుతున్న వార్షిక వ్యయం తెలియచేస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు. అలాగే గోశాల నిర్వహణ వ్యయం కూడా తెలియజేయాలన్నారు. దేవస్థానానికి గల భూముల వివరాలు, వాటిపై వస్తున్న ఆదాయం తెలియచేస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం నిర్వహిస్తున్న హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్వహణకు ఏటా రూ.5 కోట్లు అవుతోందని, ఆ వివరాలు కూడా బోర్డు ద్వారా ప్రదర్శించాలని ఆదేశించారు.

సీఆర్వో వద్ద కేశఖండనశాల

భక్తులకు వసతి గదులు కేటాయించే సీఆర్వో కార్యాలయం వద్దకు కేశఖండనశాలను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈఓ ఆదేశించారు.

నిర్మాణ పనుల పరిశీలన

రత్నగిరిపై స్వామివారి ఆలయం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను ఈఓ చంద్రశేఖర్ అజాద్ బుధవారం పరిశీలించారు. రూ.రెండు వేల వ్రత మండపంలో ఏసీ మెషీన్లు పనిచేస్తున్నాయా ? లేదా ? అని పరిశీలించారు. ఆయన వెంట ఏఈఈ కృష్ణారావు, డీఈలు గుర్రాజు, సుధాకర్, ఇతర అధికారులు ఉన్నారు.

నాలుగేళ్లలో 40 ఏళ్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ప్రత్తిపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం



ప్రత్తిపాడులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. గత 40 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపారని చెప్పారు. ప్రత్తిపాడులోని తోట వీధిలో బుధవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలతో సంతృప్తి చెందుతున్నారా ?..ఇంకా ఏమైనా సమస్యలున్నాయా ? అని స్థానికులను ఆరా తీశారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, ఆకుల వీరబాబు, ఏడిద రెడ్డినాయుడు, శేరు కృష్ణ, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గంగాలమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి నూతన విగ్రహం

గోకవరం: గ్రామ శివారున రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి: తాళ్లూరు శివారులో జాతీయ రహదారిని నూతనంగా నిర్మించిన దత్తసాయి మందిరంలో దత్త సాయిబాబా వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గండేపల్లికి చెందిన దువ్వూరి శేషగిరి శాస్త్రి పర్యవేక్షణలో 13 మంది రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేసి బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కల్యాణం.. కమనీయం



ఏలేశ్వరంలో సత్యనారాయణస్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నదిఒడ్డున వేంచేసిన సత్యనారాయణస్వామివారి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి పాంచాహ్నిక వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, చైర్మన్ ఐవీ రోహిత్ నేతృత్వంలో కల్యాణ బ్రహ్మ చక్రవర్తుల రాఘవచార్యులు, పాన్నూరు సత్యనారాయణచార్యులు స్వామి, అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణం తిలకించారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ కృష్ణారావు, పర్యవేక్షాధికారి పీవీ రమణ, ట్రస్టు బోర్డు సభ్యులు దోశే చిట్టిబాబు, నక్కా అశ్విని, నక్కానాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి, తరించారు. ధర్మకర్తలుపాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

కోటనందూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. పర్యావరణ లైఫ్ స్టైల్‌లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేరీలైఫ్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ దైనందిన జీవితంలో పర్యావరణానికి హాని చేయని విధానాలను అవలంభించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజాచైతన్యం కోసం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో లోగోలను అతికిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు కోట సత్తిబాబు, ఏఎంసీ చైర్మన్ సుర్ల రాజు, రుత్తల జోగిరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామశర్మ సేవలు అభినందనీయం



శ్రీరామశర్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తుని: పురపాలక సంఘం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన కొడుకుల శ్రీరామశర్మ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక చక్కా సూర్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు శ్రీరామశర్మను సహచర ఉపాధ్యాయులు, కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 1987లో ఎస్‌జీటీగా విధుల్లో చేరి 26 ఏళ్ల పాటు సేవలు అందించారని, ఎంఆర్పీ, ఎంఎల్‌ఓ, స్కూల్ సూపర్‌వైజర్‌గా చేసి మున్సిపల్ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. హెచ్‌ఎం కేఎస్‌వీ సూర్యనారాయణ, కౌన్సిలర్ సుభద్రదేవి, మూర్తి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చెల్లారావు, ఎస్.చంద్రరావు, కె.సుబ్బారావు, అప్పల నాయుడు, నాగభూషణం, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే చంటిబాబు



కాకినాడలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బుధవారం కాకినాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఎస్పీకి అభినందనలు తెలిపారు. పలు అంశాలపై ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ కిర్లంపూడిమండలాధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో నోటి క్యాన్సర్



ఇటికాయలపల్లిలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా నోటి క్యాన్సర్‌కి గురయ్యే ప్రమాదం ఉందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు అన్నారు. మండలంలోని ఇటికాయలపల్లిలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1900 స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

ఎస్.తిమ్మాపురంలో మరో ముగ్గురు..

కిర్లంపూడి: పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై టి.రఘునాథరావు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎస్.తిమ్మాపురం శివారు బెల్లం మకాంలో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న కొంకిపూడి సూరిబాబు, పేరూరి సూకరాజు, గరగా సత్యన్నారాయణను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5450 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన



ఏవీ నగరంలో ఓహెచ్ఆర్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ప్రజాప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో అరబిందో ఫౌండేషన్ ఆర్థిక సాయం రూ.10 లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి బుధవారం సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుని ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యామురళీ మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామస్తులు పడుతున్న మంచినీటి ఇబ్బందులకు అరబిందో ఫౌండేషన్ సహకారంతో పరిష్కారం లభించిందన్నారు. అరబిందో సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థలదాత యనమల సత్యనారాయణ, భాస్కర్, ఇంజినీర్ గణపతిరాజు, అరబిందో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.